క్లుప్తంగా

ఐదు ఓట్లతో వార్డు స్థానం గెలుపు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ 12వ వార్డుకు బుధవారం జరిగిన ఉప ఎన్నికల్లో చమళ్ల అనసూయమ్మ ఐదు ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ 546 ఓట్లు ఉండగా.. 349 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో అనసూయమ్మకు 174 ఓట్లు రాగా ఆమె ప్రత్యర్థి అర్.బాలకష్ణకు 169 ఓట్లు వచ్చాయి. ఆరు ఓట్లు చెల్లలేదు.

కొత్తపల్లిలో తెలుగు భాషా వారోత్సవాలు



విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మందస: కొత్తపల్లిలో తెలుగు భాషా వారోత్సవాలు బుధవారం జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 24న వక్తృత్వ, 25న వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సవర గణేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సవర అబ్రహాం, గవ్వ భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్ష చేస్తున్న డాక్టరు వెంకటరమణ

పలాస: మామిడిపల్లి గ్రామంలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. పలాస మండల కంటి వెలుగు వైద్యులు రోణంకి వెంకటరమణ ఆధ్వర్యంలో 35 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో ముగ్గురికి శస్త్రచికిత్సలు, ఏడుగురిని కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు రోణంకి వెంకటరమణతో పాటు విలేజీ హెల్త్ సెక్రటరీ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.పార్వతి, ఆశ వర్కరు ఎం.జ్యోతి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

కాశీబుగ్గ: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా రైల్వేశాఖ పనిచేస్తోందని విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు అన్నారు. బాలకార్మికులను తరలించేకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ల పరిధిలో ఉండే గొడౌన్లు, ఫుట్‌కోర్టులు, స్టాల్స్, పార్శిల్ కార్యాలయం, పార్కింగ్ స్టేషన్లు తదితర చోట్ల బాలకార్మికులను పనుల్లో పెట్టుకొని పట్టుబడితే సంబంధిత యజమానిపై కేసులు పెడతామన్నారు. ప్రయాణికులు కూడా బాల కార్మికులు ఉన్నట్టు తెలిస్తే 139, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ఎస్సై శ్రీనివాసరావు, చైల్డ్‌లైన్ సీవో జె.భాగ్యరెడ్డి, ఆర్పీఎఫ్ జీఆర్పీ, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

టెక్కలి: డిప్లమో విద్యలో ప్రవేశించిన విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో బుధవారం కళాశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్లమో కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పలు ప్రైవేట్ సంస్థల్లో మంచి ఉద్యోగవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులంతా ఉన్నత చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లమో డీడీ బి.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన

ఇచ్ఛాపురం: స్థానిక బ్రాహ్మణవీధిలోని మున్సిపల్ ఒడియా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోలీసు విధులపై బుధవారం అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం అరుణ కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులను స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌కు బుధవారం తీసుకెళ్లగా.. ఎస్సై రమేష్ తమ విధులను వివరించారు.

జాబిల్లిపై అడుగు పెట్టిన వేళ..

జాబిల్లిపై అడుగు పెట్టాలనే ఆకాంక్షతో భారత శాస్త్రవేత్తలు చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని అన్నివర్గాల ప్రజలు ఆకాంక్షించారు. ఇందులో భాగంగా ఇస్రోకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు చంద్రయాన్-3, ఇస్రో అక్షర క్రమంలో కూర్చున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయాల్లో కూడా పూజలు నిర్వహించారు. కాగా ప్రయోగం విజయవంతం కావడంతో పిల్లలు..పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.



పలాస: చంద్రయాన్-3 అక్షరాకారంలో బ్రాహ్మణతర్లా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: ఇస్రో ఆకృతిలో సన్యాసిపుట్టుగ యూపీ పాఠశాల విద్యార్థులు



టెక్కలి: విక్రమ్ అక్షర క్రమంలో రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: చంద్రయాన్-3 ఆకృతిలో సత్యసాయి హైస్కూల్ విద్యార్థులు



కాశీబుగ్గ: కాశీబుగ్గలోని మేధా డిగ్రీ కళాశాలలో పూజలు చేస్తూ..



కాశీబుగ్గ: రామక్రిష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో శాంతిమంత్రం పటిస్తున్న విద్యార్థులు



నందిగాం: జయహో చంద్రయాన్-3 విజయవంతం కావాలని నినాదాలు చేస్తున్న దేవళభద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు



సోంపేట: బారువ ప్రాథమిక పాఠశాలలో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

మెరుగైన సేవలు అందజేయాలి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి
- అధికారులతో సమీక్ష

టెక్కలి: అన్నివర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ సేవలు అందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనకు, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులంతా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి కోరారు. టెక్కలిలో నియోజకవర్గ స్థాయిలో వైద్యం, విద్య, వ్యవసాయ, వంశధార, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఎన్ఆర్ఈజీఎస్ తదితర శాఖల అధికారులతో తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవసరమైన సాగునీరు అందజేయడానికి వంశధార ప్రాజెక్టు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడా సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రైతులకు యూరియా, డీఏపీ సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాపింగ్ చేసే విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. రైతులకు అందాల్సిన సంక్షేమ పథకాల విషయంలో ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతులకు అనుకూలంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని.. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాలువలు, ఇతర మౌలిక వసతులతో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణంలో పంచాయతీ రాజ్ శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులు, కల్వర్టుల నిర్మాణం విషయంలో బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు రహదారి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందే విధంగా చూడాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమంతో పాటు విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండే విధంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతీ రోజూ పర్యవేక్షించాలని విద్యా శాఖాధికారులను వాణి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఉపాధి కల్పించే విధంగా జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను కోరారు. వర్షాకాలంలో మంచినీరు కలుషితం కాకుండా శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ బి.వి.తిరుమలరావు, వంశధార ఈఈ కె.శ్రీకాంత్, ఆస్పత్రి సూపరింటిండెంట్ బి.సూర్యారావు, ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి, విద్యుత్ శాఖ డీఈఈ వి.ఎ.రాజశేఖర్, ఆర్అండ్‌బీ డీఈ రవికాంత్, విద్యా శాఖాధికారులు డి.తులసీ రెడ్డి, చిన్నారావు, ఏపీడీ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

విద్యుత్, వైద్య సేవలపై సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

- మందస మండల సమావేశం

మందస: విద్యుత్, వైద్యాధికారుల పనితీరు బాగోలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మందస మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. మండల ప్రత్యేకాహ్వానితుడు దల్లి జానకీరావురెడ్డి మాట్లాడుతూ.. పొత్తంగిలో విద్యుత్ తీగల సమస్య ఉన్న విషయాన్ని సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో 21 ఏళ్ల యువకుడికి విద్యుత్‌షాక్ తగిలి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో స్థానికులు రక్షించారన్నారు. కేవలం విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. మూలిపాడు జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ పాఠశాల ఎదురుగా వాహనాలు, విద్యార్థులు వెళ్లే దారిలో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారగా.. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సర్పంచ్ గుసిరి వెంకటరావు ధ్వజమెత్తారు. గిరిజన గ్రామమైన రాయికోల వీధుల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయని జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ సభ దృష్టికి తెచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని, జేఎల్ఎంపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ ఎల్.యోగి చెప్పారు. హరిపురం సీహెచ్‌సీలో బాలిగాం దళిత వీధికి చెందిన ఓ గర్భిణి ప్రసవానికి వెళ్తే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయడంతో బిడ్డ మరణించిందన్నారు. మందస పీహెచ్‌సీలో సిబ్బంది సక్రమంగా పని చేయడంలేదని, చెట్టుపై నుంచి ఓ వ్యక్తి పడిపోతే వైద్యం చేయలేదని మందస ఎంపీటీసీ సభ్యుడు కంచిబెహరా ఆరోపించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు ఉపయోగమైన పథకాలు, పనులు చేస్తుంటే.. కొంతమంది అధికారులు, ఉద్యోగులు ప్రజలకు సేవలందించడంలేదని సభ్యులు ధ్వజమెత్తారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ మధు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు కోరగా, సభలో ఆయన లేకపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కాగా జలవనరులశాఖ, మత్స్యశాఖ, బీసీ వెల్ఫేర్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఫిషరీస్, ఉద్దానం ప్రాజెక్టు, ఐటీడీఏ అధికారులు గైర్హాజరయ్యారు. గతంలో ఎంపీటీసీ సభ్యుడు వాయలపల్లి మాధవరావు సంకుజోడు మరమ్మతులపై అడిగారని, నేడు పనులు పూర్తి చేశామని ఎంపీడీఓ తిరుమలరావు చెప్పారు.

ఇది ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్సీ నర్తు రామారావు

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం నడుస్తోందని ప్రత్యేక ఆహ్వానితుడుగా హాజరైన ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పథకాలు, సేవలు అందిస్తోందన్నారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలన్నా, వాటికి సార్థకత చేకూరాలన్నా ఇదే ప్రభుత్వం కొనసాగాలన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ ప్రాంతానికి దొరికిన ఆణిముత్యమని, అభివృద్ధి చేయడంలో ముందున్నారని ప్రశంసించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, పీఏసీఎస్ చైర్మన్ అగ్గున్న సూర్యారావు, బాలిగాం చైర్మన్ సౌర దిల్లేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.విజయలక్ష్మి, కంచిలి వ్యవసాయమార్కెటింగ్ కమిటీ చైర్మన్ బతకల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకానికి నాంది

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి
- దుప్పలపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను అమలు చేస్తూ నవశకానికి నాంది పలికారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. కస్తూరిపాడు సచివాలయం పరిధి దుప్పలపాడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలను కోరారు. సమస్యలపై వినతులను స్వీకరించారు. వాటిని ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వాణి కుమార్తె డాక్టర్ హైందవి తల్లికి తోడుగా వచ్చి ప్రజలకు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు, మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరావు, సర్పంచ్‌లు గురువెల్లి సూర్యప్రకాశరావు, హనుమంతు శేషగిరి, నూక సత్యరాజ్, సుంకరి జనార్దన, పేడాడ విలాస్, ఉర్జాన సురేష్, గొరివెల్లి గోవిందరావు, సనపల క్రిష్ణమూర్తి, ఆర్.శివారెడ్డి, అక్కురాడ సురేష్, తోట సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు చెంచు, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, సింగూరు నారాయణరావు, సచివాలయ కార్యదర్శి గోవిందరావు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ బ్రోచర్‌ను అందజేస్తున్న దువ్వాడ వాణి

చిన్నాచారికి ప్రజామిత్ర బిరుదు ప్రదానం



చిన్నాచారిని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: లొద్దబద్ర గ్రామానికి చెందిన మొక్కల ప్రేమికుడు, సంఘ సేవకుడు కొత్తపల్లి చిన్నాచారికి ప్రజామిత్ర బిరుదు వచ్చింది. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర శివ నవ చైతన్య కళానాట్య సంక్షేమ సంఘం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తగరపువలసలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నాచారి సేవలకు కొనియాడారు. అనంతరం ప్రజామిత్ర బిరుతో విశాఖ సెంచూరియన్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ చేతుల మీదుగా సత్కరించారు.

నేడు మందసలో ఉచిత వైద్య శిబిరం

మందస: మందసలో ఈ నెల 24వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జెమ్స్ ఆస్పత్రి మేనేజర్ బి.చిన్నారావు చెప్పారు. ఎముకలు, కీళ్లమార్పిడి తదితర సమస్యలకు సంబంధించి శిబిరంలో సేవలందిస్తామన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సత్కారం

కంచిలి: బోధనా సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యా శాఖాధికారి-1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రం కంచిలి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.కామరాజు అధ్యక్షతన ఇటీవల బదిలీపై సోంపేట వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు పురంధర్ భిసాయిని పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన ఈ పాఠశాలలో అందించిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీతారాంనాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వంకల దుర్యోధన, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



పురంధర్ బిసాయిని సన్మానిస్తున్న దృశ్యం

ఆంధ్రకేసరికి ఘనంగా నివాళులు



ఇచ్ఛాపురం రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో నివాళులర్పిస్తున్న చిన్నారులు



టెక్కలి గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు



సంతబొమ్మాళి: బోరుభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రకేసరికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టుల పెడితే చర్యలు



సోషల్ మీడియా ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిపై రౌడీషీట్ తెరుస్తామని కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జిలతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేసి నియమ నిబంధనలు వివరించారు. పలాస నియోజకవర్గంలో కొద్దిరోజులుగా ఒకరిపై ఒకరు తప్పుడు పోస్టులు పెట్టుకుంటుండడంతో పార్టీలు, వర్గాలు, జాతుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయని అన్నారు. శాంతిభద్రతలకు కూడా విఘాతం కలుగుతోందన్నారు. ఎవరైనా తప్పుడు పోస్టులు పెడితే అందుకు ఆ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జిలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సోషల్ మీడియా నియమ నిబంధనలకు లోబడి పోస్టులు పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నుంచి యాళ్ల సంతోష్, టీడీపీకి చెందిన పీరుకట్ల విఠల్‌రావు, జనసేన తరఫున విశ్రాంత ఎస్ఐ కోన కృష్ణారావు పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకం రెపరెపలు

కాశీబుగ్గ: చంద్రయాన్-03 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీడిపరిశ్రమ యజమానులు బుధవారం రాత్రి ఇందిరాచౌక్ వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.



జాతీయజెండాతో పీసీఎంఏ కార్యవర్గ సభ్యులు